చేయండి. ఈ నగలు తాకట్టు పెట్టి ఏ ఆటో అయినా కొనుక్కొని మనుగడ సాగించండి. ఏమో! ఆ ఆటోనే పెద్ద ఇండస్ట్రీగా మారి మరి కొందరికి జీవనోపాధి అందిస్తుందేమో! నామాట ఎవ్వరూ పొల్లుపోదు. మీ చేతికి డబ్బు రాగానే తిరిగి నా నగలు నాకిచ్చేద్దురుగాని" సీత చేతులు పట్టుకుని, నిష్టూరంగానూ, వేడికోలుగానూ అంది సింధు.

సీత భర్తకేసి చూసింది.

"తీసుకో రాముడూ!" అన్నాడు నగేష్.

అప్రయత్నంగా దాన్నందుకున్నాడు రాముడు.

"రాముడూ ఒక్కమాట! మెల్లిగా అంది సింధు.

"చెప్పండమ్మా!" అన్నాడతను వినయంగా.


"జరిగిందంతా మర్చిపోతారుగా.. ఈ విషయం సీత దగ్గర ఏనాడూ ఎత్తకు..."

"అవును రాముడూ! స్త్రీ మనసు చాలా సున్నిత మైనది. చిరుగాలికే రెపరెపమంటుంది. అందుకే సీత శీలం కోల్పోయిందని..."

"లేదు బాబూ! నా సీత శీలం కోల్పోలేదు. నా సీత నిప్పులాంటిది. ఎవరో కామాంధుడు ఒళ్ళు మరిచి తాకినంత మాత్రాన నిప్పు నిప్పు కాకుండా పోతుందా? ఎందరో పాపులు తనలో మునిగినంత మాత్రాన గంగ అపవిత్రురాలవుతుందా? నా సీతా అంతే బాబూ!" సీతని మరింత పొదివి పట్టుకుంటూ అన్నాడు రాముడు.

'రాముడూ!"

కాదు బాబూ! రాముడు కాదు ఇకనుంచి నాపేరు మార్చుకుంటాను. ఎవరో ఏదో అంటారని కట్టుకున్న భార్యని నిప్పుల్లో దూకమనేంత ధర్మ గుణం, ఎవడో తాగి వాగాడని ఇల్లాల్ని, నిండు చూలాల్ని అడవిపాలు చేసేంతటి దైవత్వం నాకు లేవు బాబూ! అందుకే నేను రాముణ్ణిగాను. నా సీతని మాత్రం నా గుండెల్లో పదిలంగా దాచుకుంటాను జీవితాంతం" అంటూ కంట్లో వూరిన నీటిని కండువాతో అద్దుకుంటూ ఓ చేత్తో ట్రంక్ పెట్టెని, మరో చేత్తో భార్యనీ పొదివి పట్టుకుని బైటికి నడిచాడు ఆ పిచ్చి నౌకరు సింధు, నగేష్‌లు పాలిపోయిన మొహాలతో చేతులు ఊపుతుంటే– 'సెహభాష్!" అన్నట్టు తూర్పు నించి సూర్యభగవానుడు అల్లరిగా తొంగి చూశాడా దంపతులకేసి.



# బల్లకింద చేయి

"డాడీ నాకో హండ్రెడ్ రూపీస్ ఇవ్వండి"

'ఎందుకమ్మా?'

"పొండి డాడీ! అన్నింటికీ వివరాలు చెప్పాలి. పెద్ద చదువన్న తర్వాత అనేక అవసరాలుంటాయి..". బుంగమూతి పెట్టింది రమణి.

"సారీ అమ్మా మాటవరసకి అడిగాను. వంద కాకపోతే రెండు వందలు తీసుకో" అంటూ జేబులో నుంచి రెండొందలు తీసి కూతురి చేతిలో పెట్టాడు.




రమణి అనందంగా పక్కనే వున్న బుక్స్ తీసుకొని "నేను ఫ్రెండింటికి చదువుకోవడానికి వెళ్తున్నాను. వచ్చేటప్పటికి బాగా పొద్దుపోతుంది. మీరేమీ కంగారుపడకండి" అని చెప్పి వెళ్లిపోయింది గబగబా.

"ఏమిటండీ! ఎంత గారాబం అయితే మాత్రం అది అడిగిన వెంటనే ఎంతంటే అంత ఇచ్చెయ్యడమేనా!" రుసరసులాడుతూ అంది భార్య లక్ష్మి లోపల్నుంచి వస్తూ.

"మనకి వున్నది ఒకే ఒక్క కూతురు. లేక లేక పుట్టింది. సంపాదించేది తనకోసమేగా. అన్నట్లు నాకు బజారులో పనుంది. స్నానం చేసి వస్తాను. త్వరగా అన్నం వడ్డించు" అని బాత్రూమ్‌లోకెళ్లాడు హడావుడిగా.

అతడి పేరు ముకుందరావు. ఆర్.ఐ.గా ఉద్యోగం చేస్తూ బల్లకింద చేయి పెట్టి బాగానే గడించాడు.

స్నానం చేసి వచ్చి భార్య వడ్డించిన వేడి వేడి అన్నం తిని నీట్‌గా తయారై సన్నగా విజిల్ వేసుకుంటూ వీధిలోకి వచ్చాడు. ఆరోజున బల్లకింద ఆదాయం పెద్దమొత్తంలో రావడంతో మనిషి బాగా హుషారుగా వున్నాడు.

వీధిలో రిక్షా ఎక్కి నేరుగా రంభ థియేటర్ దగ్గరికి వెళ్లాడు. సెక్స్ పిక్చర్. అప్పుడే మొదలుపెట్టారు. ముకుందరావు గబగబా టిక్కెట్టు తీసుకొని హాల్లోకి అడుగుపెట్టాడు. లోపల అంతా చీకటిగా వుండటంతో కష్టపడి సీటువెతుక్కొని కూర్చున్నాడు. తెరపై నగ్న దృశ్యాలను ఆత్రుతగా చూడసాగాడు. ఇంటర్వెల్ అవడంతో లైట్లు వేశారు. సరిగ్గా అప్పుడు చూశాడు ముకుందరావు– అతడికి ముందులైనులో బోయ్‌ఫ్రెండ్‌తో వున్న తన కూతుర్ని. కరెంట్ షాక్ కొట్టినట్లయింది అతడికి.

"మా డాడీ సంపాదించిన పాపపు సొమ్ము ఇలా మన సరదాలకీ, సరసాలకీ పనికొస్తోంది" అంది ప్రియుడితో.

ముకుందరావుకి ఎవరో చెంపమీద కొట్టినట్లనిపించింది.

ఆ రోజునుంచే బల్లకింద చెయ్యిపెట్టడం మానుకొన్నాడు.

–బి.రామకృష్ణ,
–అమరావతి.